బండారం బట్టబయలు!

- ఇన్నాళ్లూ చేసిందీ వైపీపీ ప్రచారమేనా?
- వలంటీర్ల రాజీనామాలతో నిజమవుతున్న ప్రతిపక్షాల ఆరోపణలు

వలంటీర్లే వైసీపీ నాయకులు. ఇక జగనన్న సైన్యం వారే. రాబోయే ఎన్నికల్లో వారే పార్టీని గెలిపించుకోవాలి.

- ఇటీవల కుప్పంలో వైసీపీ అభ్యర్థి అయిన ఎమ్మెల్సీ భరత్ చేసిన ప్రకటన ఇది. కుప్పం మండలంలో వలంటీర్ల చేత మూకుమ్మడిగా రాజీనామాలు చేయించిన తర్వాత మాట్లాడారాయన.


ఇన్నాళ్లు ప్రజలకు ఎంతో సేవ చేశాం. ఆ సేవను అడ్డుకుంటున్నారు. అందుకే వలంటీరు ఉద్యోగాలకు రాజీనామాలు చేస్తున్నాం. ఇక వైసీపీ గెలుపుకోసం పనిచేస్తాం.

- అదే సందర్భంలో వలంటీర్ల చేత వైసీపీ నేతలు మాట్లాడించిన మాటలివి.

ఈ రెండు ప్రసంగాలు.. వైసీపీ సారథ్యంలో వలంటీర్ల రాజీ(డ్రా)మాలు చూస్తే చాలు. ఈ వలంటీర్లంతా ప్రజల సొమ్మును ప్రభుత్వ జీతంగా పొందే వైసీపీ కార్యకర్తలు అనే విషయం బయటపడుతోంది. ఈ పరిణామాలు ప్రతిపక్షాల ఆరోపణలను నిజం చేస్తున్నాయి.







కేంద్ర ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేయడంతో అడ్డగోలుగా వీరిని ఎన్నికల్లో వాడుకోవాలనుకున్న వైసీపీ ఆలోచనలకు గండి పడుతోంది. దీంతో ఆ పార్టీ నేతలు వ్యూహం మార్చారు. ఇన్నాళ్లు వలంటీర్లకు తొడిగిన సేవ అనే ముసుగును తొలగించి పార్టీ సేవకు వాడుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభాల్లో ముంచడానికి పక్కా ప్రణాళికతో ముందుకు వస్తున్నారు. వలంటీర్లతో రాజీనామాలు చేయించి ప్రత్యక్షంగా రాజకీయాల్లో ప్రచారాస్త్రాలుగా మార్చుకుంటున్నారు. కొంతమంది పరోక్షంగా సహకరిస్తాం రాజీనామాలు చేయమని చెబుతున్నా వారిపై వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలు ఒత్తిడి చేయించి బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 'ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ఈ రెండు నెలలు మేమే ఇస్తాం.. మా వెంట తిరగండి అవసరమైతే అదనంగా సొమ్ములు ఇస్తాం. వచ్చేది మా ప్రభుత్వమే మళ్లీ మిమ్మల్నే వలంటీర్లుగా నియమించుకుంటాం' అంటూ నమ్మించి రంగంలోకి దింపుతున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పథకాలు ఆగిపోతాయని, ఇళ్లకు వచ్చి పింఛను ఇవ్వరంటూ తమ పరిధిలోని ఓటర్లను కలిసి దుష్ప్రచారం చేయించి.. వైసీపీకి అనుకూలంగా ఓటు వేయించేలా వలంటీర్ల ద్వారా ఎమ్మెల్యే అభ్యర్థులు కుయుక్తులు పన్నుతున్నారు. దీనికోసం ఇప్పటికే జిల్లాలోని సగం మంది వలంటీర్ల ద్వారా రాజీనామా చేయించినట్లు తెలుస్తోంది. కుప్పం నియోజకవర్గంలోని 1,350 మంది వలంటీర్లకుగాను ఇప్పటిదాకా 1110 మందిచేత వైసీపీ నేతలు రాజీనామాలు చేయించారు. ఇక, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారన్న కారణంగా నియోజకవర్గంలో దాదాపు 10 మంది వలంటీర్లను అధికారులు విధులనుంచి తొలగించారు.

కుప్పం టీడీపీకి కంచుకోట. వైసీపీ అడ్డదిడ్డ విధానాలు, అరాచకాలు, అక్రమ కేసులు, భూ కబ్జాల నేపథ్యంలో టీడీపీ గ్రాఫ్ బాగా పెరిగింది. చంద్రబాబు ప్రజల్లో అభిమానం వెల్లువెత్తుతోంది. ఈ క్రమంలో కుప్పంపై దృష్టి పెట్టారు. తాము చెప్పే మాటలను ఎలాగూ ఓటర్ల నమ్మరు కాబట్టి.. ఆ అబద్ధాలనే వలంటీర్ల ద్వారా చెప్పించేందుకు చర్యలు చేపట్టారు. తద్వారా చంద్రబాబు మెజారిటీని తగ్గించే లక్ష్యంతో వలంటీర్లను వాడుకునేందుకు ప్లాన్ వేశారు. ఇప్పటికి దాదాపు 80 శాతం మందితో రాజీనామాలను చేయించారు.

ప్రజల సొమ్ముతో చేసింది అధికార పార్టీ ప్రచారమేనా?

నేతల మాటలు.. వలంటీర్ల రాజీనామాలు.. వారితో చెప్పించే మాటలు.. ఇవన్నీ చూస్తే ఇన్నాళ్లు వలంటీర్లు వైసీపీకి సేవ చేశారనేది అర్థమవుతుంది. ఎలాగంటే.. ఎన్నికల కోడ్.. ఈసీ నిర్ణయం నేపథ్యంలో వలంటీర్లు విధులకు దూరంగా ఉంటున్నారు. అంటే, వీరు పథకాల సొమ్ము పంపిణీ పేరిట ఇంటింటికి వెళ్లే అవకాశం లేదు. తద్వారా వైసీపీ ప్రచారం సాధ్యం కావడంలేదు. కాబట్టే ఆ పార్టీ నేతలు వీరిచేత బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. ప్రత్యక్షంగా ఎన్నికల ప్రచారంలోకి దింపుతున్నారు. అంటే ఇన్నాళ్లూ ప్రజల సొమ్ముతో వేతనాలు తీసుకుంటూ వలంటీర్లు చేసింది జగన్ సేవేనని తేటతెల్లమవుతున్నట్లేగా.

అయినా సమాచారమంతా వలంటీర్ల వద్దే

వలంటీర్లకు ప్రభుత్వం తరపున సిమ్‌లు ఇచ్చారు. వాటిని వివిధ డేటా సేకరణ యాప్‌లకు అనుసంధించారు. సంక్షేమ పథకాల పేరిట కుటుంబాలకు సంబంధించిన సర్వ సమాచారాన్ని ఆ యాప్‌ల ద్వారా బయోమెట్రిక్ విధానాన్ని ఉపయోగించి రాబట్టారు. వలంటీరు మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లను ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎప్పుడో బ్లాక్ చేశారు. అయితేనేం.. యాప్‌లతోపాటు వలంటీర్లు ఎప్పటికప్పుడు వ్యక్తిగతంగా మొత్తం సమాచారాన్ని రిజిస్టర్లలో నమోదు చేసుకుని దగ్గరుంచుకున్నారు. ఈ సమాచారం అధికార పార్టీ నేతలకు సైతం ఎప్పుడో చేరిపోయింది. వలంటీర్లచేత రాజీనామాలు చేయించి ఈ సమాచారాన్ని ఉపయోగించి ఓటర్లకు వల వేసేలా ప్లాన్ వేస్తున్నారు.

- కుప్పం

పార్టీని గెలిపించాల్సింది వలంటీర్లే..!

వలంటీర్లు స్టార్ క్యాంపెయినర్లుగా పనిచేయాలి. ప్రతి ఇంటికీ వెళ్లి మళ్లీ జగనన్న వస్తేనే పథకాలు కొనసాగుతాయని చెప్పాలి. వైసీపీకే ఓట్లు పడేలా మోటివేట్ చేయాలి.

- ఇటీవల పూతలపట్టు సభలో సీఎం జగన్ మాటలివి.

సీఎం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థుల వరకు ఇదే మాట

మా అవసరం లేదా అంటూ వైసీపీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధుల అసహనం

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఈ ఎన్నికల్లో వలంటీర్లపైనే వైసీపీ ఆశలు పెట్టుకుంది. గెలుపు బాధ్యత వారిపైనే పెడుతోంది. సీఎం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులూ వలంటీర్లకే ప్రాధాన్యమిస్తున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యే అభ్యర్థులూ వలంటీర్లతో సమావేశాలు నిర్వహించారు.. ఇంకా నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో కష్టపడి గెలిపించాలని కోరుతున్నారు. బతిమాలి.. ఒత్తిడి తెచ్చి వలంటీర్లతో రాజీనామాలు చేయించి మరీ పార్టీకి వాడుకుంటున్నారు. ఇలా, తమ గెలుపు విషయంలో వలంటీర్లపైనే ఆధారపడుతున్నారు. ఈ పరిణామం పట్ల వైసీపీ గ్రామస్థాయి నేతలు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు అసహనంతో ఉంటున్నారు. గత ఎన్నికల్లో తాము కష్టపడితేనే కదా గెలిచింది అని గుర్తుచేస్తున్నారు. మరిప్పుడు తమకు ప్రాధాన్యం లేకపోవడంపై వీరంతా ఆగ్రహంతో ఉన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా పోయింది. ఒకప్పట్లో ఇల్లు, పెన్షన్, ఏదైనా పథకం మంజూరు కావాలంటే గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కీలకంగా ఉండేవారు. పట్టణాల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ఆ పరపతి ఉండేది. దీంతో వీరికీ ప్రజల్లో గౌరవం లభించేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాల్లో వలంటీర్లకు ప్రాధాన్యం ఇచ్చారు. సర్పంచులకు, ఎంపీటీసీలకు గుర్తింపు లేకుండా చేశారు. దీంతో ఫలానా పని కావాలని క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులను అడిగేవారు లేకుండా పోయారు. ఈ పరిణామంతో వీరంతా డమ్మీలుగా మారిపోయారు.

నిధులు మళ్లించేసి..

మరోవైపు గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు, జిల్లా.. మండల పరిషత్తులకు కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల్ని వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించేస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు రూ.125 కోట్లకుపైగా మూడు విడతల్లో మళ్లించేసింది. దీంతో గ్రామాల్లో సర్పంచులు చిన్న పనులూ చేయలేని పరిస్థితి. ఇలా, గ్రామాల్లో తమకు గౌరవం లేకుండా చేశారని వీరంతా అసహనంతో ఉన్నారు. ఈ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో 90 శాతానికిపైగా ఉన్నది వైసీపీ వారే కావడం గమనార్హం. ఇప్పుడు ఎన్నికల సమయంలో పార్టీ పరంగానూ తమకన్నా వలంటీర్లకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంపై వీరంతా ఆగ్రహంతో ఉన్నారు. గ్రామస్థాయి నాయకత్వానిదీ ఇదే పరిస్థితి. ఈ లెక్కన ఎన్నికల్లో మేమంతా పనిచేయాల్సిన అవసరం లేనట్లుంది అని ఓ నాయకుడు వ్యాఖ్యానించడం గమనార్హం. ఒకవేళ తాము పార్టీ కోసం కష్టపడి గెలిపించినా.. క్రెడిట్ వలంటీర్లకే వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ఆ మాత్రం దానికి అంత కష్టపడాలా? అని ప్రశ్నించారు. ఇక, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు విలువ ఉంటుందని అధికార పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు అభిప్రాయపడుతున్నారు. ఇలా క్షేత్రస్థాయిలో వైసీపీలో మొదలైన అసహనం.. అసంతృప్తి.. పోలింగ్ నాటికి ఏ స్థాయికి చేరుతుందో?

కాణిపాకంలో వైభవంగా ఉగాది వేడుకలు



చాక్లెట్ గణపతి



ఆలయ ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ



పంచాంగ పఠనం



ఉత్సవమూర్తికి గ్రామోత్సవం



స్వామి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 9: కాణిపాకంలో తెలుగు సంవత్సరాది ఉగాది (క్రోధి నామ సంవత్సరం) వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకంను నిర్వహించారు. దీనికి దివంగత నేత గురజాల మహదేవ నాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అభిషేకం, పూజలు ముగిశాక స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ కల్యాణ వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లను ఉంచి పూజలు నిర్వహించారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మోహన్‌రామలింగస్వామి పంచాంగ పఠనం చేశారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. రాత్రి ఉత్సవ మూర్తులను కాణిపాకం పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి వేలూరుకు చెందిన రాధాకృష్ణ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉగాది వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులతో కాణిపాకం రద్దీగా మారింది. ఆయా కార్యక్రమాల్లో ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఆస్థాన సిద్ధాంతి శివకుమార్‌శర్మ, ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎక్స్‌అఫిషియో మెంబరు సోమశేఖర్ గురుకుల్, అర్చక, పండితులు పాల్గొన్నారు.

'రంజాన్ తోఫా' ఏదీ జగనన్నా

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9: టీడీపీ హయాంలో ఇస్తున్న రంజాన్ తోఫాకు మరిన్ని సరుకులు కలిపి ఇస్తామని 2019లో రంజాన్ సమయంలో ప్రతిపక్ష నేత హోదాలో జగన్ చెప్పారు. 2020 నుంచి ఇస్తామన్నారు. ఆ మాటలను నిజమని మైనారిటీలు నమ్మారు. కానీ, ఐదేళ్లయినా రంజాన్ తోఫా ఇవ్వలేదు. మాట నిలబెట్టుకోలేదు. 'మైనార్టీ వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు మిగిలివున్న చర్యలు చేపడతాం. ఆ పార్టీ (టీడీపీ) చేసిందేమి లేదు. మా పార్టీయే (వైసీపీ) ఎంతో చేసింది' అని చెప్పడమే కానీ చేసిందేమీ లేదని ముస్లింలు అంటున్నారు. జిల్లాలో సుమారు 25వేల నుంచి 30వేల వరకు ముస్లిం కుటుంబున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో బియ్యం కార్డున్న ముస్లిం కుటుంబాలకు చంద్రన్న రంజాన్‌తోఫా కిట్ అందించేవారు. వాటిలో రెండు కిలోల చక్కెర, ఐదు కిలోల గోధుమ పిండి, కిలో సేమియా, వంద గ్రాముల నెయ్యి వంటి సరుకులు ఉండేవి. వీటితో పేద ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా, ఆనందంగా జరుపుకొనే వారు. దీనికి మరిన్ని సరుకులు కలిపి ఇస్తానని అధికారంలోకి వచ్చిన జగన్.. ఆ మాటే మరిచారు. ఇప్పుడు అందరితో పాటు ప్రభుత్వం ఇచ్చే బియ్యం, చక్కెర మాత్రమే ఏప్రిల్ నెల కోటాలో తీసుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం): సా. 6.30

పూతలపట్టుకు ఎంఎస్‌బాబు

- జీడీనెల్లూరు బరిలో డిప్యూటీ సీఎం మేనల్లుడు
- కాంగ్రెస్ మలివిడత జాబితా విడుదల

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 9: కాంగ్రెస్ పార్టీ పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల అభ్యర్థులను మంగళవారం రాత్రి ప్రకటించింది. మలివిడత జాబితాలో పూతలపట్టుకు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, గంగాధరనెల్లూరు అభ్యర్థిగా రమేష్ బాబుకు అవకాశం ఇచ్చారు.

వైసీపీ అభ్యర్థిపై బాబు ప్రభావం



2019లో పూతలపట్టు నుంచి వైసీపీ తరఫున ఎంఎస్ బాబు పోటీచేసి భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈసారి ఆయన్ను కాదని సునీల్‌కుమార్‌కు వైసీపీ టికెట్ కేటాయించడంతో ఆయన పార్టీకి దూరమవుతూ వచ్చారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరి పూతలపట్టు టికెట్ తెచ్చుకున్నారు. పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ముఖ్యంగా దళితవాడల్లో బాబుకు పట్టు ఉంది. ఆయన్ను కాదని సునీల్‌కుమార్‌కు వైసీపీ టికెట్ ప్రకటించిన నాటి నుంచి బాబు వర్గం అధికార పార్టీ కార్యక్రమాల్లో, వైసీపీ అభ్యర్థికి దూరంగా ఉంటూ వచ్చారు. నియోజకవర్గంలో దాదాపుగా దళితుల్లో ఎక్కువ శాతం తమిళులే ఉండటం.. తమిళ్ మాల వర్గానికి చెందిన బాబుకు కలిసొచ్చే పరిణామమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. వీరి మద్దతు ఆయనకు ఎక్కువగానే ఉంది. ఈ కారణంగా పూతలపట్టు నియోజకవర్గంలో వైసీపీ ఓట్లు చీలే అవకాశం ఎక్కువగా ఉంది.

మేనమామ కూతురిపైనే పోటీ



డిప్యూటీ సీఎం నారాయణస్వామి మేనల్లుడు అయిన రమేష్ బాబుకు గంగాధరనెల్లూరు టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ కేటాయించింది. వైసీపీ అభ్యర్థిగా నారాయణ స్వామి కుమార్తె కృపాలక్ష్మికి టికెట్ కేటాయించిన విషయం తెలిసిందే. గత పది సంవత్సరాలుగా నారాయణస్వామికి అనధికార వ్యక్తిగత కార్యదర్శిగా రమేష్ బాబు కొనసాగుతూ వచ్చారు. దీంతో నియోజకవర్గంలో రమేష్ బాబుకు స్థానిక నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఇటీవల నారాయణస్వామిని వ్యతిరేకించిన రమేష్ బాబు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ గంగాధరనెల్లూరు టికెటును రమేష్ బాబుకు కేటాయించింది. దీంతో ఆ నియోజకవర్గంలో వైసీపీకి పెద్ద దెబ్బ అనే చెప్పాలి.

ఇదేం ప్రక్షాళన..?

- ఎస్బీ నుంచి ఎలక్షన్ సెల్‌కు ఆ సీఐ బదిలీ
- జిల్లా నుంచే మార్చేయాలని టీడీపీ నేతల ఫిర్యాదు
- ఐదేళ్లయినా బడా నేత అండతో జిల్లాలోనే కొనసాగింపు

చిత్తూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలకమైన ఓ సీఐని స్పెషల్ బ్రాంచి విభాగం నుంచి ఎలక్షన్ సెల్‌కు బదిలీ చేశారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ మణికంఠ తీసుకున్న తొలి నిర్ణయమిదే. సోమవారం నుంచి ఆ సీఐ ఎస్బీ బాధ్యతలను మరో సీఐకు అప్పగించారు. ఆ సీఐని జిల్లా నుంచి బదిలీ చేయకుండా మళ్లీ ఇక్కడే ఉంచడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఎస్పీ జాషువా ఉన్నప్పుడు ఎన్నికల షెడ్యూల్‌కు ఒకరోజు ముందు సుమారు 200 మంది సిబ్బంది బదిలీ జరిగింది. ఇలా ఎస్బీలోనూ తమకు అనుకూలమైన 14 మంది టీమ్‌ను సిద్ధం చేసుకోవడంలో ఆ సీఐదే కీలకపాత్ర అని తెలుస్తోంది. జిల్లాకు చెందిన ఓ బడా నేతకు దగ్గరి వ్యక్తిగా పేరున్న ఆ సీఐ.. ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తున్నట్లు ప్రచారముంది. దీనికి అనుగుణంగా జిల్లాలోని ఎస్ఐ, సీఐలకు సూచనలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లాలో సుమారు ఐదేళ్లపాటు పనిచేసిన ఈయన, లా అండ్ ఆర్డర్‌లో కాకుండా లూప్‌లైన్ పేరుతో స్పెషల్ బ్రాంచి విభాగంలో ఉన్నారు. ఈయన ఎస్బీలో ఉండి ప్రతిపక్షాలను ఇబ్బంది పెడుతున్నారని టీడీపీ నాయకులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరికి జిల్లాకు వచ్చిన కొత్త ఎస్పీ.. ఈయన్ను ఆ విభాగం నుంచి బదిలీ చేసి ఎలక్షన్ సెల్‌కు మార్చారు. అక్కడున్నా ఆయన జిల్లాలోని పోలీసు అధికారుల్ని ప్రభావితం చేస్తారని, బయటి జిల్లాకు బదిలీ చేయాలని టీడీపీ నాయకులు పట్టుబడుతున్నారు. ఇదిలా ఉండగా, కీలక సీఐ కంటే ఎస్బీ విభాగ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న కొత్త సీఐ చాలా జూనియర్. సీనియర్ సీఐ పక్కనే ఉండి ఈయన్ను ప్రభావితం చేసే అవకాశం ఉందని టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

Sitaram Jindal Foundation Scholarship Scheme



Description: Sitaram Jindal Foundation Scholarship Scheme 2024 is an initiative by the Sitaram Jindal Foundation (NGO), for students from Class 11 to the postgraduate level. It aims to provide financial assistance to underprivileged students pursuing various degree/diploma courses.

Eligibility: Open to students currently enrolled in Class 11, 12, ITI, diploma, undergraduate, or postgraduate degree programs. Applicants must have met the minimum percentage requirement in their previous qualifying exam.

Prizes & Rewards: Up to 3,200 per month

Last Date to Apply: Round The Year

Application mode: By post to: The Trustee, Sitaram Jindal Foundation, Jindal Nagar, Tumkur Road, Bengaluru - 560073

Short Url: www.b4s.in/aj/SJS2

SCHOLARSHIP ALERT

Ujjivan Small Finance Bank Transgender Scholarship

Description: Ujjivan Small Finance Bank Limited invites applications from transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/ private open schools or open universities.

Eligibility: Open to transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/private open schools or open universities. Students must have scored at least 50% marks in the previous academic year. Annual family income of the applicants must not exceed INR 10,00,000.

Prizes & Rewards: Scholarship up to INR 40,000 ***Last Date:*** 30-04-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/USFB1

University of Kent India Women in Leadership Scholarship 2024

Description: University of Kent India Women in Leadership Scholarship 2024 is an opportunity offered by the Uni versity of Kent to female applicants who have received a conditional offer to pursue a postgraduate course at the university.

Eligibility: Open for female students from and domiciled in India. Applicants must have received a conditional or unconditional offer for a full-time taught master's degree programme by the deadline.

Prizes & Rewards: 50% of the tuition fees for one year of study

Last Date to Apply: 24-05-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/LPUK1

buddy4study.com

దిక్సూచి DIKSUCHI

ఇంటర్‌తో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం

ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ ఎగ్జామ్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నుంచి భారీ నోటిఫికేషన్ వెలువడింది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష తరవాత అత్యంత ఆదరణ కలిగిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సిహెచ్ఎస్ఎల్)-2024 కోసం ఎస్ఎస్‌సి ప్రకటనను విడుదల చేసింది. ఈసారి సిహెచ్ఎస్ఎల్ ద్వారా **3,712** పోస్టులను భర్తీ చేయనున్నారు.

భర్తీ చేసే పోస్టులు

1. లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
2. డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
3. డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఎ)

అర్హత: ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి ఇంటర్ ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్జూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ మినిస్ట్రీ, కల్చర్ మినిస్ట్రీలో డేటా ఎంట్రీ పోస్టులకు మాత్రం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌తో మేథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

వయసు: 2024 ఆగస్టు 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

ఎంపిక విధానం: అభ్యర్థులను మూడు దశల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఈ మూడు దశలను టైర్-1, టైర్-2, స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్‌గా వ్యవహరిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **వెబ్‌సైట్:** ssc.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0U9xCcMలో చదవండి.

నిట్ దుర్గాపూర్‌లో ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ

దుర్గాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) ప్రోగ్రాములలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రతి కోర్సులో సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంఎస్‌డబ్ల్యూ: ఇది రెండేళ్ల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. మొత్తం 15 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ఎంబీఏ: కోర్సు వ్యవధి రెండేళ్లు. మొత్తం 44 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 17, ఓబీసీలకు 11, ఎస్టీలకు 3, ఎస్సీలకు 6, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4, దివ్యాంగులకు 3 సీట్లు ప్రత్యేకించారు. అకడమిక్ ప్రతిభ, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 7
- **అడ్మిషన్స్:** జూలై 3
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 27
- **తరగతులు ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** nitdgp.ac.in



హ్యాట్రిక్ హిట్ కోసం..



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలు ఘన విజయం సాధించాయి. హ్యాట్రిక్ హిట్ కోసం వీరిద్దరూ మళ్లీ జత కట్టారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించే ఈ సినిమా వివరాలను ఉగాది సందర్భంగా మంగళవారం వెల్లడించారు. బ్యాక్ టు బ్యాక్ ఏడు హిట్స్ అందించిన అనిల్ రావిపూడికి దిల్ రాజు నిర్మాణ సంస్థలో ఇది ఆరో సినిమా కావడం గమనార్హం. హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ లవ్ స్టోరీ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం వినోదభరితంగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.

టిల్లు మన మనిషి అయిపోయాడు

ఎన్టీఆర్

సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' మార్చి 29న విడుదలై ఘనవిజయం అందుకుంది. విడుదలైన తొమ్మిది రోజుల్లోనే రూ. 100 కోట్ల గ్రాస్ సాధించిన 'టిల్లు స్క్వేర్' సక్సెస్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ "సిద్ధూకి సినిమా తప్ప వేరే ఏమీ తెలియదు. నిరంతరం వర్క్ గురించే ఆలోచిస్తుంటారు. ఈ సినిమాతో సిద్ధు కేవలం విజయాన్ని అందుకోవడమే కాకుండా మన జీవితంలో



కలకాలం మిగిలిపోయే ఒక పాత్రను ఇచ్చారు. ఈ రోజు టిల్లు... మన ఇంట్లో, మన చుట్టూ తిరిగే మనిషి అయిపోయాడు. నేనిక నవ్వలేను బాబోయ్ అనేంతలా సిద్ధూ నవ్వించారు" అని చెప్పారు. దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా 'టిల్లు స్క్వేర్' మాత్రమే కాదు, రాధిక స్క్వేర్ కూడా. ఈ సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో ప్రత్యక్షంగా చూశాను. అందుకే ఈ రేంజ్ సక్సెస్ వారికి దక్కింది" అని అన్నారు. కథానాయకుడు విశ్వక్ సేన్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం సిద్ధు ఎంతగా ఎఫోర్ట్ పెట్టారో నాకు తెలుసు. టిల్లు పాత్ర ఎప్పటికీ నిలిచిపోతుంది" అని తెలిపారు. చిత్ర కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "ఈ సినిమాను ఇంతలా ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. నేను చెప్పిన డైలాగ్ తారక్ అన్న నోటి నుంచి రావడం కంటే పెద్ద అవార్డ్ ఇంకోటి ఉండదు" అని చెప్పారు. దర్శకుడు రామ్ మల్లిక్ మాట్లాడుతూ "ఈ సినిమా విజయంలో చిత్ర బృందం సమష్టి కృషి ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు విచ్చేశారు.

రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి



రవితేజ తన కెరీర్‌లో 75వ చిత్రం మైలు రాయిని చేరుకోవడానికి సిద్ధమయ్యారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన ల్యాండ్ మార్క్ ఫిల్మ్‌ను ప్రకటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రం వివరాలు వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. దాని మీద 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి' అని రాసి ఉంది. దీనిని బట్టి చూస్తే తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిదని అర్థమవుతుంది. ఇందులో రవితేజ పేరు లక్ష్మణ భేరి. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రం 'ధూమ్ ధామ్ మాస్ దావత్' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: కార్తిక్ ఘట్టమనేని, ఎడిటింగ్: నవీన్ నూలి.

ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్



వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్నారు హీరో శ్రీవిష్ణు. ఉగాది సందర్భంగా మంగళవారం ఆయన తన 19వ చిత్రాన్ని ప్రారంభించారు. దిల్‌రాజు క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి షాట్‌కి వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శత్వం వహిస్తున్నారు. అనూష ద్రోణవల్లి, సీతాకుమారి కొత, గోపాలం లక్ష్మీదీపక్ నిర్మిస్తున్నారు. కోన వెంకట్, బాబీ కొల్లి సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: చోటా కె ప్రసాద్, సంగీతం: విజయ్ బులగానిన్, డీఓపీ: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:వై నాగు.

ఈ జర్నీని ఎంజాయ్ చేశా



అంజలి నటించిన హారర్ కామెడీ చిత్రం 'గీతాంజలి' 2014లో విడుదలై సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. హారర్ కామెడీ మూవీస్‌లో కొత్త ఒరవడిని సృష్టించిన ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' లోనూ అంజలి నటించింది. ఈ సినిమా ఆమెకు 50వ చిత్రం కావడం విశేషం. ఈ నెల 11న హారర్ కామెడీగా తెరకెక్కిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి మీడియాతో ముచ్చటించారు.

నా సినిమాలన్నీ దాదాపు జీ అక్షరంతో మొదలవడం యాదృచ్ఛికం. గీతాంజలి సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలనే ఆలోచన ఇప్పటిది కాదు. ఈ సినిమా కథను కోన వెంకట్ నాలుగేళ్ల క్రితమే చెప్పారు. కొన్ని అడ్డంకుల వల్ల ఈ ప్రాజెక్ట్ తెరకెక్కడం ఆలస్యమైంది. అన్ని అడ్డంకులను దాటుకొని అద్భుతమైన అవుట్‌పుట్‌తో ఈ సినిమాను పూర్తిచేసినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా సీక్వెల్ కాబట్టి పాత క్యారెక్టర్స్‌ను మార్చలేం. కాబట్టి కొత్త క్యారెక్టర్స్‌ను స్టోరీలోకి తీసుకువచ్చాం. ఈ సినిమాలో హారర్, కామెడీతో పాటు మిగిలిన అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఈ చిత్రం నా 50వ చిత్రం కావడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. అప్పుడే ఇన్ని సినిమాలు చేసేశానా అనిపిస్తుంది. ఒక నటిగా ఈ జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/461Zp1y లో చదవండి.

నిహారిక కమిటీ కుర్రోళ్లు



మెగా డాటర్ నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'కమిటీ కుర్రోళ్లు' అనే టైటిల్ ఖరారు చేశారు. ఉగాది సందర్భంగా ఈ చిత్రం పోస్టర్‌ను హీరో సాయిదుర్గా తేజ్ విడుదల చేసి యూనిట్‌కు అభినందనలు తెలిపారు. నిహారిక మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు', దామోదర్ స్టూడియోస్ సంస్థతో కలసి నిర్మిస్తున్నా. కొత్తవాళ్లతో ఈ సినిమా చేయడం బాధ్యతగా భావిస్తున్నా' అన్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్న యదు వంశీ మాట్లాడుతూ 'పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. వినోదభరితంగా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. కొత్త నటీనటులతో పాటు సాయికుమార్, గోపరాజు రమణ, బలగం జయరామ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఫొటోగ్రఫీ: రాజు ఎడురోలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్, నిర్మాతలు: పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక.

డిఫరెంట్ కథతో 'షణ్ముఖ'



ఆది సాయికుమార్, అవికా గోర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. రమేశ్‌యాదవ్, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఈ చిత్రం టైటిల్ లోగోను లాంచ్ చేశారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ "కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమా ఇది. అందరినీ తప్పక ఆకట్టుకుంటుంది" అన్నారు. దర్శకుడు షణ్ముఖం మాట్లాడుతూ "డిఫరెంట్ కథతో 'షణ్ముఖ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తయ్యింది" అని చెప్పారు. నిర్మాత రమేశ్ యాదవ్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో ఆది చాలా కొత్తగా కనిపిస్తారు" అని తెలిపారు.







బోసిపోయిన చిత్తూరులోని రైల్వే ఓవర్ బ్రిడ్జి

స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

● అత్యధికంగా శ్రీరంగరాజపురంలో 39.4 డిగ్రీల నమోదు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9: వారంరోజులుగా నిప్పుల కొలిమిని తలపించిన ఎండలు.. చిత్తూరులో మంగళవారం కాస్త తగ్గుముఖం పట్టాయి. మండలాలవారీగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు.. శ్రీరంగరాజపురంలో 39.4, నింద్రలో 39.0, విజయపురంలో 38.9, నగరిలో 38.9, పుంగనూరులో 38.8, గుడిపాలలో 38.7, తవణంపల్లెలో 38.3, గుడుపల్లెలో 38.0, పాలసముద్రంలో 37.8, చిత్తూరులో 37.6, నదుంలో 37.6, శాంతిపురంలో 37.4, కుప్పంలో 37.1, బంగారుపాళ్యంలో 37.0, చౌడేపల్లిలో 37.0, రొంపిచెర్లలో 37.0, పులిచెర్లలో 37.0, గంగాధరనెల్లూరులో 36.6, కార్వేటినగరంలో 36.5, పెద్దపంజాణిలో 36.4, సోమలలో 36.2, వెదురుకుప్పంలో 36.2, యాదమరిలో 36.1, పలమనేరులో 36.1, పెనుమూరులో 36.1, వి.కోటలో 35.9, పూతలపట్టులో 35.7, గంగవరంలో 35.2, ఐరాలలో 35.1, బైరెడ్డిపల్లిలో 35.0, రామకుప్పంలో 34.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్వారీని అడ్డుకున్న గ్రామస్తులు



కుప్పం, ఏప్రిల్ 9: కుప్పం మండలం కృష్ణదాసన పల్లె పంచాయతీ రాజనం గ్రామ సమీపంలో నడుస్తున్న గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ క్వారీ పేలుళ్ల వల్ల చాలాకాలంగా ముగజీవాలు మృతి చెందుతున్నాయని వాళ్ళు ఫిర్యాదు చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వస్తే ఎప్పుడు ఏ పేలుడు వల్ల, ఏ రాయి వచ్చి మీద పడుతుందోనని క్షణక్షణం ప్రాణభయంతో బతుకుతున్నామన్నారు. ఎన్నిసార్లు క్వారీ యాజమాన్యానికి చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ఇంటి గోడలు కూడా బీటలువారి ఆస్తి నష్టం కూడా సంభవిస్తున్నదాని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ కార్యకలాపాలను అధికారులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

వరసిద్ధుడి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 9: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కరోల్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

తిరుమలలో సందర్శనీయ ప్రాంతాలు కళకళ



జపాలి ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరాది ఉగాది సందర్భంగా తిరుమలలోని సందర్శనీయ ప్రాంతాలు మంగళవారం కళకళలాడాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చిన యాత్రికులతోపాటు తిరుపతి, తిరుమల స్థానికులు పాపవినాశనం, ఆకాశగంగ, జపాలి, వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీవారిపాదాలు, చక్రతీర్థం, శిలాతోరణం వద్ద కిక్కిరిసి కనిపించారు. మంగళవారం కావడంతో జపాలి ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. గోగర్భం డ్యాం వద్దనున్న క్షేత్రపాలకుడు(రుద్రుడు), పాచికాల్వ గంగమ్మ ఆలయం, స్థానికులు నివాసముండే బాలాజీనగర్‌లోని వినాయక స్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి.

తిరుపతి ఎంపీ అభ్యర్థిగా చింతా మోహన్

రెండో జాబితాతో అనుమానాలకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం



తిరుపతి , ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇండియా కూటమి పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ సీటు సీపీఐకి వెళ్లడంతో ఎంపీ సీటు కూడా ఇతరులకు కేటాయిస్తారేమోనన్న అనుమానాలకు కాంగ్రెస్ అధిష్ఠానం తెరదించింది. మంగళవారం విడుదల చేసిన రెండోజాబితాలో తిరుపతి ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ చింతా మోహన్‌కే కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించింది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న చింతా మోహన్ రాష్ట్ర విభజన అనంతరం 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ, 2021 ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. అయినా పార్టీనే అంటిపెట్టుకుని కాంగ్రెస్ జెండాను ఊరూ వాడా తిప్పారు. అయితే ఎంపీ సీటు తనకు వస్తుందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అంజయ్య ఇటీవల మీడియా ముందు ఇండియా కూటమి తరఫున స్వీయ ప్రకటన చేశారు. అసెంబ్లీ సీటుతో పాటు ఎంపీ సీటు కూడా ఇండియా కూటమికి వెళ్లే అవకాశాలున్నాయన్న వార్తల నేపథ్యంలో చింతా మోహన్ పదిరోజులుగా ఢిల్లీలో మకాం వేశారు.ఎట్టకేలకు ఏఐసీసీలో తనకున్న ప్రాబల్యాన్ని మరోసారి చాటుకున్నారు. ఆయన తిరుపతి ఎంపీగా ఉప ఎన్నికలతో కలిపి పదకొండోసారి పోటీ చేయబోతున్నారు.

వైసీపీ శ్రేణులకు పండుగ బహుమతి

● ఒకటిన్నర సెంటు ఇంటి స్థలానికి ఎంజాయ్‌మెంటు పట్టా

రేణిగుంట, ఏప్రిల్ 9 : రేణిగుంట పట్టణంలో ఎంపిక చేసిన వైసీపీ కార్యకర్తలకు పండుగ బహుమతి పంపిణీ జరిగింది.ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ముఖ్య ప్రజాప్రతినిధి కుమారుడు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పట్టణంలో జరిగిన వైసీపీ కార్యకర్తల అత్యవసర సమావేశంలో రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే మధన్నను మళ్లీ గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల పరిధిలోని ఓ ప్రభుత్వ భూమికి సర్వే నెంబరు వేసి ఆ భూమిలో ఎనిమిది సంవత్సరాలుగా కాపురం ఉ ంటున్నట్లు, తహసీల్దారుకు అర్జీ పెట్టుకుంటే ఆ విషయాన్ని గుర్తించి 2016లో ఒకటిన్నర సెంటు పట్టా ఇచ్చినట్లు చూపుతున్న పత్రాలను వైసీపీ క్యాడర్‌కు పంపిణీ చేశారు. అయితే మధన్న ఎమ్మెల్యేగా ఈసారి గెలిచిన తరువాత ఇంటి జాగాలు చూపిస్తామనడం కొసమెరుపు.దీంతో ఈ ఇంటి పట్టాలు అసలా, డూప్లికేటా అని తీసుకున్నవాళ్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తిరుమల ఆలయం ముందు శ్రీరాముడి ప్రతిమ








తిరుమల ఆలయంలో ఫల,పుష్పాలంకరణలు - తిరుమల ఆలయంలో అద్దాల మండలపం వద్ద రామలక్ష్మణుల సెట్టింగ్

శ్రీవారి ఆలయంలో ఆకట్టుకున్న అలంకరణలు

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో ఉగాది ఆస్థానం సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరిగింది. శ్రీవారి ఉత్సవర్లను బంగారు వాకిలిలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా, మరోపీఠంపై విష్వక్సేనులవారినీ వేంచేపు చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు.టీటీడీ ఉద్యానవన విభాగ ఫల, పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. 10 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్ ఫ్లవర్స్‌ను అలంకరణకు వినియోగించారు. ప్రత్యేకించి ఆలయంలో ఆపిల్, ద్రాక్ష, బత్తాయి, నారింజ, కర్బూజ, మామిడి వంటి విభిన్న రకాల పండ్ల గుత్తులు, ఉత్తమజాతి పుష్పాలతో భూలోక వైకుంఠంగా శ్రీవారి ఆలయాన్ని రూపొందించారు.ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పుచ్చకాయలతో చెక్కిన దశావతారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే అయోధ్య రామాలయం, బాలరాముడి సెట్టింగ్, నవధాన్యాలతో రూపొందించిన మత్స్య అవతారం భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం వెలుపల గొల్లమండపం పక్కన త్రేతా, ద్వాపర, కలియుగాలకు సంబంధించిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరస్వామి, వేదనారాయణ స్వామి, మహావిష్ణువు దశావతరాలు, ఉద్యానవనంలో ఆడుకుంటున్న రామలక్ష్మణ సమేత హనుమంతులు, బాలకృష్ణుడు వంటి పౌరాణిక ఘట్టాలు విశేషంగా ఆకర్షించాయి. ఉద్యానవన విభాగ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 150 మంది పుష్పాలంకరణ కళాకారులు, టీటీడీ గార్డెన్ సిబ్బంది వందమంది రెండురోజుల పాటు శ్రమించి ఆకర్షణీయమైన ఫల, పుష్పాలంకరణ ఆకృతులను రూపొందించారు.





తిరుమల ఆలయంలో మత్స్యావతారం సెట్టింగ్

పాడి రైతులకు ప్రోత్సాహమేదీ?

గత పథకాలు తొలగించారు..కొత్త వాటి ఊసే లేదు ● గ్రాసం కొరతతో అల్లాడుతున్న పశువులు

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 9 : పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే రైతులకు ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహమూ అందలేదు. పశుపోషకులకు అందాల్సిన రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా దూరమయ్యాయి. పాల ఉత్పత్తి పెంపుతోపాటు పాడి రైతులకు ఆర్థిక చేయూత అందించేలా గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు వైసీపీ ప్రభుత్వం స్వస్తి పలికింది. పశుగ్రాసం కొనలేక, పశువులను పోషించలేక కబేళాలకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఆవులు 8,00,132, గేదెలు 2,74,535, గొర్రెలు 12,62,226, మేకలు 4,68,916 ఉన్నాయి. వీటి కోసం 1,432 ఆర్బీకేలు, 283 సబ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

గత ప్రభుత్వ హయాంలో ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాల ఉత్పత్తి పెంపునకు ఏటా పశు పోషకులకు పాతర గడ్డి(సైలేజ్), దాణాతోపాటు పలు పథకాలు రాయితీపై అందించారు. ఏటా టన్నుల కొద్ది పాతర గడ్డి బేళ్లను నేరుగా గ్రామాల్లోని పశు పోషకులకు అందజేశారు. 75 శాతం రాయితీపై పాతర గడ్డి కిలో రూ. 2కే సరఫరా చేశారు. దాణా కూడా 75 శాతం రాయితీపై కిలో రూ.4కే సరఫరా చేసే వారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధుల కింద పశువుల సంరక్షణ షెడ్ల నిమిత్తం గోకులం, మినీ గోకులం నిర్మించారు. ఉపాధి హామీ నిధులతో ఊరూరా పశుగ్రాసం విస్తారంగా సాగు చేయించారు. అధిక సంఖ్యలో రైతులు వేసవిలో పశుగ్రాసం కొరత ఉన్న అన్నీ ప్రాంతాలకు పచ్చగడ్డి సరఫరా చేసి ఆదాయం పొందారు. వేసవి సీజన్‌లో పొలాలకు వెళ్లిన పశువులకు తాగునీటి సమస్య లేకుండా అందుబాటులో ఉన్న చేతిపంపుల వద్ద నీటి తొట్టెలు నిర్మించారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత..

2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే గోకులం, మినీ గోకులం పథకాలను రద్దు చేసింది. వాటిని నిర్మించుకున్న పాడి రైతులకు బిల్లులు నిలిపేసింది. అప్పటి వరకు పాడి పరిశ్రమకు సంబంధించి అమల్లో ఉన్న అన్ని పథకాలను ఆపేసింది. గత ప్రభుత్వ హయాంలో రాయితీపై దాణామృతం కిలో రూ.3కే అందిస్తుంటే దాని ధర రూ.6.50లకు పెంచేసింది. రాయితీపై పాతర గడ్డి ఇవ్వని కారణంగా పల్లెల్లో పశుపోషకులు వరిగడ్డిపైనే ఆధారపడాల్సి వస్తోంది. వరిగడ్డి ట్రాక్టరు ట్రక్కు ధర రూ.20వేల వరకు పలుకుతోంది. దీంతో కొనలేని పరిస్థితి నెలకొంది. ఎండాకాలం పాల దిగుబడి తగ్గడంతో ఆదాయం తగ్గుముఖం పట్టింది. ఐదేళ్లుగా పాతర గడ్డి పెంపకానికి ప్రోత్సాహం అందకపోవడం, రాయితీపై దాణా ఇవ్వకపోవడంతో పాడి రైతులు తీవ్రస్థాయిలో నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.



పశుగ్రాసం లేక బక్కచిక్కుతున్న గేదెలు

కర్ణాటక మద్యం స్వాధీనం

ఒకరి అరెస్టు



బైరెడ్డి పల్లె,ఏప్రిల్9: మండలంలోని కైగల్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళ వారం ఎస్ఐ కృష్ణయ్య కైగల్ వద్ద వాహన తనిఖీ చేపట్టారు.కూటాలవంకకు చెందిన నటరాజు ద్విచక్రవాహనంలో 864 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నా రు. మద్యం విలువ రూ.34,585లు ఉంటుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

● ఆరుగురి అరెస్టు


శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 9: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కుళాయప్ప కథనం మేరకు... ఎస్ఆర్‌పురం మండలం దిగువ ముద్దికుప్పం గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి దిగువ ముద్దికుప్పం గ్రామానికి చెందిన మహలింగం, చిరంజీవి, ఆనందయ్య, జయపాల్, అరుణ్, శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని, వారి వద్ద రూ.4,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కనకాంబరం.. కిలో వెయ్యి

బంతిపూలు రూ.వంద ● ఉగాది, రంజాన్ ఎఫెక్ట్‌తో ఆకాశాన్నంటిన ధరలు

బంతిపూల తోట





పుంగనూరు మార్కెట్‌లో అమ్మకాలకు ఉన్న గుండెమల్లెలు

పుంగనూరు, ఏప్రిల్ 9: హిందువులకు తెలుగు సంవత్సరాది, తొలి పండుగైన ఉగాది.. ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పర్వదినం. ఈ సందర్భంగా పూల ధరలు సోమ, మంగళవారాల్లో అమాంతం పెరిగాయి. పుంగనూరు, పరిసర ప్రాంతాల్లో సాగయ్యే కనకంబరాల పూలు తక్కువగా రావడం, డిమాండు అధికంగా ఉండటంతో కిలో రూ.1000 ధర పలికింది. ఇక, బంతిపూల మాల రూ.200 నుంచి రూ.250 వరకు పలికాయి. నిన్నటి మొన్నటిదాకా కిలో చెండుమల్లె బంతిపూలు కిలో రూ.10 లోపే ఉండగా పుంగనూరు గంగజాతర సందర్భంగా కిలో రూ.30 నుంచి రూ.40కి పెరగ్గా ప్రస్తుతం కిలో బంతులు ఒకటో రకం రూ.120- నుంచి రూ. 100 వరకు పలికాయి. ఎక్కడ చూసినా పూల దుకాణాల వద్ద జనమే. ధర ఎక్కువగా ఉన్నా ఇళ్లలో పూజలు, దివంగతుల ఫొటోలు, సమాధుల వద్ద వేయడానికి పూల మాలలు అవసరం కావడంతో బంతిపూలతో అల్లిన మాల రూ.250తో విక్రయాలు జరిగాయి. రోజా మాలలు అయితే రూ.400 నుంచి రూ.500 వరకు పలికింది. గుండెమల్లెలు కిలో రూ. 400 నుంచి రూ.500, సన్నజాజి మల్లెపూలు కిలో రూ. 700, చామంతిపూలు రూ.300, చిట్టిరోజాలు రూ. 300నుంచి రూ.350, లిల్లీపూలు రూ.280 నుంచి రూ.300 ధరలు పలికాయి. ప్రజలు ధర ఎక్కువైనా పూల కొనుగోళ్లలో వెనక్కితగ్గలేదు. వర్షాలు సరిగా లేకపోవడం, గతేడాది పూల ధరలు భారీగా పతనం కావడంతో పూలు కోయడానికి వెచ్చించిన కూలీలు కూడా రాకపోవడంతో భారీగా పూల రైతులు నష్టపోయారు. దీంతో పూలపంటసాగు తక్కువగా ఉండటంతో హిందూ ముస్లింల ముఖ్యమైన పండుగలు ఒకేసారి రావడంతో ధరలు అధికంగా పెరిగాయి. కనకంబరం పూలు, చెండుమల్లె, చిట్టిరోజాపూలు, చామంతిపూలు పుంగనూరు ప్రాంతం నుంచి బయట నగరాలకు ఎగుమతి అవుతాయి. మిగిలిన పూలు బయట ప్రాంతాల నుంచి దిగుమతి అవుతాయి. ఈ ధరలు కొద్దిరోజులు ఇలాగే ఉండొచ్చని పూల వ్యాపారులు అంటున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్లు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 61,920 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 17,638 మంది తలనీలాలు సమర్పించారు.

జేఈఈ మెయిన్స్‌కి 10 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 9: జిల్లాలో ఈనెల 4న మొదలైన జేఈఈ మెయిన్స్ సెషన్ 2 పరీక్షలు ఐదో రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. వేమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో 121 మందికి గాను 111 మంది హాజరు కాగా, 10 మంది గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు.

మద్యం విక్రయాలపై ఈసీ నిఘా పెంచాలి

తెలుగు యువత



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 9: రాష్ట్రంలో మద్యం విక్రయాలపై ఎన్నికల కమిషన్ (ఈసీ) నిఘా పెంచాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 2019 ఉగాది పర్వదినాన సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామన్న చెప్పిన జగన్.. చివరకు రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చేశారని ధ్వజమెత్తారు. గతంలో ఉన్న బ్రాండ్స్ రద్దుచేసి.. కొత్తపేర్లతో మరిన్ని ప్రవేశపెట్టి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారన్నారు. దీనిపై మహిళలు నిలదీయాలని పిలుపునిచ్చారు. మరోవైపు నాణ్యత లేని మద్యం విక్రయిస్తుండడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో మద్యం ద్వారా గెలవాలని చూస్తున్నారని, ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా 3,500 దుకాణాల్లో 15వేల మంది సొంతపార్టీ కార్యకర్తలను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారని ఆరోపించారు. ప్రతి దుకాణంలో టోకెన్ విధానంతో వైసీపీ కార్యకర్తల కనుసన్నల్లో అనధికారంగా మద్యం బాటిల్స్ అందజేస్తూ.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆగ్రహించారు. అందువల్ల మద్యం విక్రయాలను ఈసీ పరిధిలోకి తేవాలని విన్నవించారు. అలాగే డిజిటల్ పేమెంట్ సిస్టం తీసుకొచ్చి, డిస్టలరీస్‌పై నిఘా పెట్టాలన్నారు. ఇప్పటివరకు జరిగిన విక్రయించిన మద్యంపై శ్వేత పత్రం విడుదల చేయాలని, ఆడిటింగ్ జరపాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణయాదవ్, కర్ణం సంతీప్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాసులు, తోటవాసు తదితరులు పాల్గొన్నారు.

భావితరాలు బాగుండాలంటే టీడీపీని గెలిపించండి

● చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు విజ్ఞప్తి



చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 9: భావితరాలు బాగుండాలంటే టీడీపీని ఆదరించి, కూటమి బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం కోరారు. ఉగాది సందర్భంగా పార్లమెంటరీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన భావితరాల భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యం అన్నారు. తాయిలాలకు ఆశపడి మరోసారి మోసపోయి తమ జీవితాలను అంధకారంలోకి నెట్టుకోవద్దంటూ ప్రజలను హెచ్చరించారు. ఈ ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపేలా.. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. ముందుచూపుతో వ్యవహరించే నారా చంద్రబాబు నాయుడు లాంటి నాయకుడి నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌కు అవసరమన్నారు. నాడు అన్న ఎన్టీఆర్ సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. చంద్రబాబు విజన్‌ను ప్రజలు అర్థం చేసుకుని, ఆయనకు అండగా నిలవాలన్నారు. ఆశయాలకు అనుగుణంగా పనిచేసే తమ లాంటి విద్యావేత్తలను ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీలు బలపరచిన అభ్యర్థులకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

టీటీడీ జేఈవో బాధ్యతల స్వీకారం



తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హెల్త్, ఎడ్యుకేషన్ జేఈవోగా ఎం.గౌతమి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జేఈవోగా పనిచేసిన సదాభార్గవి బదిలీ అయిన క్రమంలో ఆ స్థానంలో గౌతమిని నియమిస్తూ సోమవారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

టీడీపీలో చేరిన వైసీపీ విద్యార్థి సంఘ నాయకుడు



పలమనేరు, ఏప్రిల్ 9 : వైసీపీ విద్యార్థి సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకులు కిషోర్ ఆచారి, తెలుగు యువత నాయకులు భరత్, తులసి, కిరణ్, మోహన్, దుర్గా, నయాజ్ పాల్గొన్నారు.

అమర్ క్రోధినామ సంవత్సర శుభాకాంక్షలు



పలమనేరు, ఏప్రిల్ 9 : క్రోధినామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా పలమనేరు నియోజకవర్గంలోని ప్రజ లందరికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పలమనేరు టీడీపీ కార్యాలయం నుంచి ఆయన మాట్లాడుతూ వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా అగ్ని మారెమ్మ రథోత్సవం



గుడుపల్లె, ఏప్రిల్ 9: గుండ్లసాగరంలో కొలువైన అగ్ని మారెమ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. అగ్ని మారెమ్మ ఆలయం వార్షిక ఉత్స వాల్లో భాగంగా మంగళవారం ఉదయం వేద పండితులు శాస్త్రోక్తంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మ వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అగ్ని మారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్రాలు, పూలహారాలతో అలంకరించి రథంపై ఆశీనుల్ని చేసి మంగళ వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు పట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు ఈ ఉత్సవాన్ని తిలకించడానికి అధికంగా తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సర్పదోష నివారణ పూజలు



రామకుప్పం, ఏప్రిల్ 9: రామకుప్పం పట్టణ శివారులోని వళ్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళ వారం సర్పదోష నివారణ పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృ తాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉగాది పర్వ దినాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శిం చుకుని అర్చనలు చేయించారు. మధ్యాహ్నం పలువురు భక్తులు సర్ప దోష నివారణ పూజలు చేయించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



చౌడేపల్లె, ఏప్రిల్9: ఎర్రగాని పల్లెలో గంగమ్మ జాతర ఘనంగా నిర్వ హించారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరిం చుకుని ఎర్రగాని పల్లెలో ఉన్న గంగమ్మకు వేదపండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ మహిళలు గ్రామ దేవతలకు, గ్రామస్తులు దీపాలు సమర్పించారు.

ఘనంగా తెలుగు నూతన సంవత్సర వేడుకలు



:పంచాంగశ్రవణం చేస్తున్న వేదపండితులు ఆనందస్వామి

చౌడేపల్లె, ఏప్రిల్9: తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పర్వదినాన్ని మండల ప్రజలు ఘనంగా చేసుకున్నారు. పిత్రు దేవతలకు దుస్తులు పెట్టి పూజలు చేశారు. ఎస్అగ్ర హారంలోని రుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు ఆనందస్వామి పంచాంగ శ్రవణ చేశారు.

ఆలయల్లో విశేషపూజలు



మల్లప్పకొండలో ప్రత్యేక అలంకణలో మల్లేశ్వరుడు

గుడుపల్లె, ఏప్రిల్ 9: మండలంలో తెలుగు నూతన సంవత్సరాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మల్లప్ప కొండపై వెలసిన మల్లేశ్వరస్వామి, గుడివంక సుబ్రహ్మణ్యస్వామి, గుడుపల్లెలోని వేంకటేశ్వరస్వామి, రాళ్ల గంగమ్మ, కనమనపల్లె శ్రీనివాసస్వామి, యామిగానిపల్లె ధర్మరాజు స్వామి దేవాలయాలు. ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతల ఆలయాల్లో అర్చకులు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను రంగు రంగు పుష్పాలతో అలంకరించారు. ప్రజలు ఉదయం నుంచి ఆలయాలకు తరలివచ్చారు. అదేవిధంగా పూర్వీకుల సమాధుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.


డ్రైవర్లందరూ ఐకమత్యంతో పనిచేయాలి



డ్రైవర్లకు స్వీట్లు పంచుతున్న పన్నీర్‌సెల్వం

చిత్తూరు, ఏప్రిల్ 9: ప్రభుత్వ వాహన డ్రైవర్లందరూ ఐకమత్యంతో పనిచేయాలని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పన్నీర్‌సెల్వం అన్నారు. మంగళవారం క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలను సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా వేదపండితులు పంచాంగాన్ని పఠించి, ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అనంతరం సంఘ అధ్యక్షులు డ్రైవర్లకు స్వీటు బాక్సులను పంచి పెటారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ జనరల్ సెక్రటరీ రోషన్ బాషా, ఉపాధ్యక్షులు హరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్‌బాబు, కోశాధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో ఊరేగిన వేణుగోపాలస్వామి



కార్వేటినగరం, ఏప్రిల్ 9: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో ఉగాది ఆస్థాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రుక్మిణి సమేత సత్యభామ వేణుగోపాల స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అభాగ్యులకు అన్నం వితరణ



పలమనేరు, ఏప్రిల్9 : పలమనేరులోని అభాగ్యులకు పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మధుసూదన్‌రావు మంగళవారం అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్టాండు, ఆలయాల సమీపంలో, చెట్లు, బస్సుషెల్టర్ల వద్ద అభాగ్యులకు అన్నం ప్యాకెట్లు అందజేశారు.

ఇఫ్తార్ భోజన ప్యాకెట్ల పంపిణీ



సోమల, ఏప్రిల్ 9: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు తిరుపతికి చెందిన శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత సూర్యసేన్ నంజం పేటలో 300 మందికి భోజన ప్యాకెట్లను అందజేశారు. షేక్ ఖాదర్‌వలి, అస్లాం, మతగురువు ఉమర్, రిజ్వాన్ పాల్గొన్నారు.

రొంపిచెర్లలో పంచాంగ శ్రవణం

రొంపిచెర్ల, ఏప్రిల్ 9: రొంపిచెర్ల మండలంలో తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని తెలుగు ప్రజలు ఉగాది పండుగ భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామాల లోని ఆలయాలలో భక్తులతో సందడి వాతావారణం నెలకొంది. పూజలు చేసి పంచాగ శ్రవణం చేశారు. పానకం, పెసరపప్పు (వడపప్పు) ప్రసాదాలుగా పంచారు. పెద్దలకు కొత్త దుస్తులు పెట్టి స్మరించుకున్నారు.

అభివృద్ధిని వివరించాలి : బీజేపీ

సోమల, ఏప్రిల్ 9: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని బీజేపీ పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ మదన్‌మోహన్ బాబు కార్యకర్తలకు సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు రామూర్తి, యుగంధర్, నవీన్, సురేంద్ర గుప్తా పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కల్లూరు, ఏప్రిల్ 9: పులిచెర్ల మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డితో కలిసి కల్లూరు సీఐ శ్రీనివాసులు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలపై బీఎల్‌వోలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ, ర్యాంపు తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలు గ్రామాల్లో ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీఎల్‌వోలు, పోలీసులు పాల్గొన్నారు.

సోమలలో ఉగాది వేడుకలు



సోమల, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సోమల మండలం లోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు జరిపారు. ఆవులపల్లె ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో పురోహితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అలాగే కుటుంబ పెద్దల సమాధుల వద్దకు వెళ్లి పూజలు జరిపారు.

తెలుగు సంవత్సరాదికి స్వాగతం

రామకుప్పం, ఏప్రిల్ 9: రామకుప్పం మండలంలో తెలుగు నూతన సంవత్సరానికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఉదయం ప్రజలు ఆయా గ్రామాల్లో గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని దిగువ వీధి గంగమ్మ, వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

తీపి, చేదులతో ఇంటింటికీ టీడీపీ



కుప్పంలో ప్రచారం చేస్తున్న తెలుగు మహిళ శారదమ్మ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 9: జీవితమంటేనే షడ్రుచుల సమ్మేళనం. అందులో తీపి, చేదులది అగ్రతాంబూళం. అందుకే తీపి బెల్లం, చేదు వేపాకులతో టీడీపీ కుప్పం మున్సిపల్ తెలుగు మహిళ అధ్యక్షురాలు శారదమ్మ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఇంటింటికీ తిరిగి వాటిని ప్రజలకు పంచిపెట్టారు. ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను గురించి వివరించారు. ఆ పథకాలతో ముఖ్యంగా మహిళల జీవితాలు ఎంతగా మెరుగుపడుతాయో విదరించారు. చంద్రబాబును లక్ష ఓట్ల మెజా రిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో సన్మానం అందుకున్న కవులు, రచయితలు

గంగవరం, ఏప్రిల్ 9: క్రోధినామ సంవత్సరం సందర్భంగా నిర్వహించిన కవిసమ్మేళనం విశేషంగా అలరించింది. మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకొని స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కవులందరూ వారి కవితలతో భాష, సంస్కృతులను పరిరక్షించుకోవాలని, సమాజంలోని రుగ్మతలను నశింపజేసి, నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అలాగే ఈ సమ్మేళనానికి హాజరైన మాధవరెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, సీతారామయ్య, మురళి , చంద్రశేఖరయ్య, కుమారస్వామిరెడ్డి, దోర్నాదుల సిద్దార్థ, ప్రసన్నలక్ష్మి, యుగంధర్‌బాబు, మురళీనాథ్, వీరభద్రగౌడు, గిరిధరమూర్తి తదితరులు వారి కవితలతో సభను ఉత్తేజపరస్తూ, తెలుగు నూతన సంవత్సరాది ఉగాది ప్రాముఖ్యతను వివరిస్తూ అలరించారు. అనంతరం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడును కవులు, రచయితలందరూ కలసి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



విశేషాలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 9 : మండలంలోని గౌనితిమ్మేపల్లె గ్రామంలో మంగళవారం ఉగాది సందర్భంగా అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే బైరెడ్డిపల్లె బాట గంగమ్మ ఆలయం, దేవదొడ్డి అంకాళపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేకపూజలు జరిగాయి. బైరెడ్డిపల్లెలోని కోదండరామాలయంలో ప్రత్యేకపూజలు జరిపి అర్చకులు తిప్పయ్యాచార్యులు పంచాంగ శ్రవణం వినిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. శేషాద్రిస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం, సల్లాపురెమ్మ ఆలయంలోనూ విశేష పూజలు జరిగాయి.

ఆలయాల్లో ఉగాది పూజలు



ప్రత్యేకాలంకరణలో కళ్యాణ వెంకటరమణస్వామి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 9: తెలుగువారి తొలిపండుగ ఉగాదిని పురస్కరించుకుని పుంగనూరు పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్థానిక కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, వాసవి కన్యాకాపరమేశ్వరిదేవి, భోగనంజుండేశ్వరస్వామి, చాముండేశ్వరిదేవి, విరూపాక్షిమారెమ్మ, సాయిబాబా, గూడూరుపల్లె లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పంచాంగశ్రవణం పఠించి భక్తులకు వినిపించారు. ప్రజలు పిత్ర దేవతలకు దుస్తులు సమర్పించారు. పెద్దల సమాధులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైసీపీ పాలనలో దళితులకు తీరని అన్యాయం



రాజపేటలో ప్రచారం చేస్తున్న కన్నన్ తదితరులు

రామకుప్పం, ఏప్రి ల్ 9: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని దళితులకు తీరని అన్యాయం జరిగిందని టీడీపీ విస్తరణ కుప్పం నియోజక వర్గ సభ్యుడు కన్నన్, రాజ్యాధికారం టీం అధ్యక్షుడు నవీన్ తెలిపారు. మంగళ వారం రామకుప్పం మండల పరిధిలోని రాజపేటలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులకు ఎటువంటి మేలు జరగక పోగా 25కు పైగా పథకాలను రద్దు చేశారన్నారు. దళితుల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణ లేకుండా పోయింద న్నారు. టీడీపీ పాలనలో దళితుల సంక్షేమం కోసం చంద్రబాబు ఎంతగానో కృషి చేశారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు విరివిరిగా సబ్సిడీ రుణాలు, చేతి వృతుల వారికి పరికరాలు అందించారన్నారు. ఎస్సీ కాలనీల్లో రక్షిత మంచినీటి పథకాలు, సీసీ రోడ్లు, ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేసింది టీడీపీ పాలనలోనే అన్నారు. పిల్లల భవిష్యత్ బాగుపడాలంటే దళితులు రానున్న ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలిచి చంద్రబాబుకు అత్యధిక మెజారిటీతో విజయం అందించాలని కోరారు. నేతలు నారాయణస్వామి, అప్పి, సుబ్రహ్మణ్యం, అశోక్ పాల్గొన్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

కల్లూరు, ఏప్రిల్ 9: పులిచెర్ల మండలం చల్లావారిపల్లి పంచాయతీ శ్రీనివాసపురం సమీపంలోని ఓ మామిడితోటలో మంగళవారం కోడిపందెం ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కోడి పుంజులను, రూ.1350 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయినవారిలో కల్లూరుకి చెందిన ముగ్గురు, మతుకు వారిపల్లి, జండామాను, వెంకటదాసరపల్లికి చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ రాజారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలకు ఉగాది శోభ



విశేషాలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

కల్లూరు, ఏప్రిల్ 9: పులిచెర్ల మండలంలో మంగళవారం ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని దేవళంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వ రస్వామి ఆలయం, కల్లూరు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, చల్లావారిపల్లి వీరాంజ నేయస్వామి ఆలయాల్లో విశేషపూజలు చేశారు. భక్తులకు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అర్చకులు అనంతకుమారాచార్యులు, పణిప్రకాష్‌శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

రొంపిచెర్లలో పంచాంగ శ్రవణం

రొంపిచెర్ల, ఏప్రిల్ 9: రొంపిచెర్ల మండలంలో తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని తెలుగు ప్రజలు ఉగాది పండుగ భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామాల లోని ఆలయాలలో భక్తులతో సందడి వాతావారణం నెలకొంది. పూజలు చేసి పంచాగ శ్రవణం చేశారు. పానకం, పెసరపప్పు (వడపప్పు) ప్రసాదాలుగా పంచారు. పెద్దలకు కొత్త దుస్తులు పెట్టి స్మరించుకున్నారు.

14మంది వలంటీర్ల రాజీనామా

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 9 : మండలంలోని తీర్థం పంచాయతీలో మంగళవారం 14మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో తాము రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు వెంట అగ్నికీలలు
పొగతో ప్రయాణికుల అవస్థలు



సోమల, ఏప్రిల్ 9: సోమల - తిరుపతి ప్రధాన రహదారి వెంట ఉన్న ఎండు గడ్డికి సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో 2కిలోమీటర్ల పొడవున మంటలు వ్యాపించాయి. ఆ మంటలు సమీప పొలాల్లోకి వ్యాపించాయి. మామిడి తోటల్లోకి వ్యాపించకుండా ఉండేందుకు కొందరు రైతులు ట్యాంకుతో నీళ్లు తెచ్చి మంటలు ఆర్పాల్సి వచ్చింది. మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న మామిడి తోటల్లోకి మంటలు వ్యాపించాయి. రాత్రి 10 గంటల నుంచి ఈమార్గంలో వాహనదారులు, ప్రయాణికులు పొగతో ఇబ్బందులు పడ్డారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

సోమల, ఏప్రిల్ 9: సోమల సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్న సోమల ఫీడర్‌లో వ్యవసాయానికి సరఫరా చేస్తున్న త్రీఫేజ్ విద్యుత్ వేళలు బుధవారం మార్పులు చేస్తున్నట్లు విద్యుత్ లైన్‌మ్యాన్ బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 1గంట నుంచి 4గంటల వరకు త్రీఫేజ్ సరఫరా ఉంటుందని వివరించారు. సోమల, చిన్న సోమల, ముండ్రివారిపల్లె, నెల్లిమంద రైతులు గమనించాలని కోరారు.

చల్లా బాబు విజయం తథ్యం





పులిచెర్ల మండలంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చల్లాబాబు సమక్షంలో టీడీపీలో చేరిన పులిచర్ల మండల వైసీపీనాయకులు

కల్లూరు, ఏప్రిల్ 9: రానున్న ఎన్నికల్లో పుంగనూరు ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవడం తథ్యమని టీడీపీ నాయకులు గోపీనాయుడు, నాగరాజ నాయుడు, సురేంద్రబాబు, రాజగోపాల్‌నాయుడు ధీమా వ్యక్తం చేశారు. పులిచెర్ల మండలంలో మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పోశంవారిపల్లి పంచాయతీ దిన్నెపాటివారి పల్లిలో ప్రారంభించిన బైక్ ర్యాలీ ఎల్లంకివారిపల్లి, మంగళంపేట, పులిచెర్ల మీదుగా రొంపిచెర్ల మండలంలోని చల్లా రామచంద్రారెడ్డి నివాసం వరకు కొనసాగింది. అనంతరం చల్లా రామచంద్రారెడ్డికి పూలమాలలు వేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తంనాయుడు, చెంగ్రాయ నాయుడు, పరంధామనాయుడు, భాస్కర్, నరసింహులు, జయచంద్రనాయుడు, పార్థసారధి నాయుడు, ప్రసాద్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మోహన్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

రొంపిచెర్ల: పులిచెర్ల మండలం పాసంవారి పల్లె, దిన్నుపాటివారిపల్లె, భయ్యారెడ్డిగారిపల్లె, కలిగుండ్లవారిపల్లెకు చెందిన 40 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ప్రభాకర్, సురేంద్ర, భాస్కర, బాలాజీ, కిరణ్, దాము ఆధ్వర్యంలో వీరంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రొంపిచెర్లలో పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి కింగ్‌హరి, గిరిధర్, వినాయక, మోహన్, అశోక్, ఢిల్లీ, లోకేష్, వేణు, వరప్రసాద్, మణి, ఏ.మోహన్, బాలక్రిష్ణ, భారత్, గోవర్ధన్, కుమార్, నరేంద్ర, విశ్వనాధం తదితరులు ఉన్నారు.

చౌడేపల్లె: చౌడేపల్లె మండలం పుదిపట్ల పంచాయతీకి చెందిన 15 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రొంపిచెర్లలో చల్లా రామచంద్రారెడ్డి నివాసంలో టీడీపీ తీర్థం స్వీకరించారు. వారికి చల్లా రామచంద్రారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీకి పూర్వ వైభవం వస్తోందన్నారు. చౌడేపల్లె మండలం నుంచి టీడీపీలోకి వలసలు పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రతి కార్యకర్తా ఒక సైనికుడిలా పనిచేసి టీడీపీని గెలిపించుకోవాలన్నారు. అప్పులాంధ్రను అభివృద్ధి బాటలో నడిపించే శక్తి చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు నాగరాజరెడ్డి, పృథ్వీ, మంజు, వినోద్‌కుమార్‌రెడ్డి, రెడ్డెప్ప, నరేష్, హరిబాబు, ఉదయ్‌కుమార్, సుమన్, మహేష్, రాజారెడ్డి పాల్గొన్నారు.

నల్లారికి ఉగాది శుభాకాంక్షలు

మాజీ సీఎం, రాజంపేట ఉమ్మడి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని చౌడేపల్లె టీడీపీ నాయకులు కలసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకుని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డితో పాటు మండల పార్టీ అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డిలు పీలేరులో ఆయన ఇంటి వద్ద కలసి శాలువలతో సత్కరించారు. నాయకులు వినోద్‌కుమార్‌రెడ్డి, నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన పుదిపట్లకు చెందిన వైసీపీ కార్యకర్తలు, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఉగాది శుభాకాంక్షలు తెలిపిన చౌడేపల్లె టీడీపీ నాయకులు

వైసీపీ దుష్ప్రచారాలను నమ్మకండి



సమావేశంలో మాట్లాడుతున్న షాజహాన్

రామకుప్పం, ఏప్రిల్ 9: టీడీపీ ఎన్డీయేతో జతకట్టడంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ముస్లింలు నమ్మరాదని మాజీ ఎమ్మెల్యే, మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా కోరారు. మంగళవారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు చంద్రబాబు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఎన్ని చట్టాలు వచ్చినా ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చంద్రబాబు చూసుకుంటారని తెలిపారు. గతంలో ఎన్డీయేలో ఉన్నప్పటికీ సీఎంగా చంద్రబాబు ముస్లింలకు రంజాన్ తోఫా, షాదీముబారక్, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం యువతకు విరివిరిగా సబ్సిడీ రుణాలు, మహిళలకు కుట్టు మిషన్లు, ఇమామ్, మౌజమ్‌లకు జీతాలు ఇచ్చారని గుర్తుచేశారు. షాదీ మహళ్లు, కబరస్తాన్ల మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేసిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. పలు చోట్ల కొత్తగా షాదీఖానాలు నిర్మించారని తెలిపారు. జగన్ పాలనలో ముస్లింలకు ప్రాణ, మాన, ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గత ఎన్నికలకు ముందు వైసీపీ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ముస్లింలను మోసం చేసిందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ముస్లిం గుర్తించి రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలన్నారు. ముస్లిం, మైనార్టీలకు మేలు జరగాలన్నా, వారి పిల్లల భవిష్యత్ బాగుపడాలన్నా టీడీపీకి అండగా నిలవాలని కోరారు. కుప్పంలో లక్ష మెజారిటీ లక్ష్య సాధనలో మైనారిటీలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మునిరత్నం, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ అంజనేయరెడ్డి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఐరాల, ఏప్రిల్ 9: మండల కేంద్ర మైన ఐరాలలోని జామియా మసీదులో మంగళవారం జరిగిన ఇఫ్తార్ విందులో పూతలపట్టు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జి మురళీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే ముస్లింల అభివృద్ధి జరిగిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు జలీల్‌బాషా, ఖయ్యాం, గిద్దాసాధిక్, నాయకులు దేవాజీ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా మురళీమోహన్ మండలంలోని పొలకల పంచాయతీలో పర్యటించారు. టీడీపీని గెలిపిస్తే గ్రామగామాన్ని అభివృద్ధిపథంలో నడుపుతామన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు సందీప్, సోమశేఖర్ నాయుడు, కొల్లారమేష్, ఎంఎన్.నాయుడు, లత, స్వర్ణ,శాంతమ్మ, రామచంద్ర నాయుడు, మురళి, జనసేన నాయకుడు పురుషోత్తం, బాలసుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా భానుప్రకాష్‌ను గెలిపించండి: టీడీపీ

నగరి ఏప్రిల్ 9: నగరి మండలం బుగ్గఅగ్రహారం పంచాయతీ పరిధిలో టీడీపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురుషోత్తమ నాయుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింటి పంపిణీ చేశారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సీనియర్ నాయకులు బాలసురేష్ నాయుడు, జనసేన నాయకుడు మెరుపుల మహేష్, దేవా తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని పన్నూరులో ఆదివారం బాబు సూపర్ సిక్స్ కరపత్రాలను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. వైసీపీ వైఫల్యాలను తెలియజేశారు. రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు రఘునాథరెడ్డి, గజేంద్ర, ముకుందరెడ్డి, గజేంద్ర, శరత్, దొరైరాజ్, బెంజిమన్, మహేంద్ర, బాలసుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

నిండ్ర: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును నిండు మనసుతో ఆశీర్వదించి సైకిల్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మండల టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని కచ్చవేడు, నేట్టేరి పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ కరప్రతాలను పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు కృష్ణయ్య, బాబుయాదవ్, దొరస్వామి నాయుడు, రమేష్, సుబ్బారావు, నెట్టేరి జగన్, శ్రీనివాసులు, మునిరత్నం, కాటయ్య, బీజేపీ నాయకులు నారాయణస్వామి నాయుడు, రమేష్, బాలకృష్ణ, జనసేన నాయకులు శివలింగం తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 9: మండలంలోని నదకుప్పం గ్రామం పక్కన చెరువులో అదే గ్రామానికి చెందిన కృష్ణయ్య కుమారుడు నాగరాజు 130 కర్ణాటక టెట్రా ప్యాకెట్లతో పోలీసులకు పట్టుబడ్డాడు. మద్యం స్వాధీనం చేసుకొని, అతడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నియామకం రద్దు కోసం డీసీవో సిఫార్సు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9: నగరి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సింగిల్ విండో)లో నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన ఉద్యోగిని తొలగిస్తూ చర్యలు తీసుకోవాలని డీసీవో ఎస్వీ నాగవర్ధన సిఫార్సు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేశారు. ఈ మేర సహకార శాఖ చిత్తూరు డీఎల్‌సీవో వనజను ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల 8న 'నగరి రూరల్ బ్యాంకు రైతులకోసమా... వైసీపీ కోసమా' అంటూ వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై బ్యాంకు మాజీ ఛైర్మన్ బాల సురేష్ నాయుడు ఆధ్వర్యంలో రైతులు పలువురు నగరి ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందించారు. ఈ వ్యవహారంపై డీసీవో సమగ్ర వివరాలు తెప్పించుకున్నారు. హెచ్.ఆర్. పాలసీ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఆ సింగిల్ విండో డైరెక్టర్ దామోదరం తన కుమారుడు పవన్‌కుమార్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి నెల చివరన రోజువారి వేతనం కింద నెలకు రూ.10వేలు చొప్పున నియమించుకున్నారు. ఇదంతా నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా ఆదేశాలపై అనధికారికంగా జరిగినట్లు తెల్సింది. కాగా సింగిల్ విండో సీఈవోగా పనిచేస్తున్న తులసీపిళ్ళై ఈనెల 4వ తేదీ నుంచి మేనెల 14వ తేదీ వరకు మెడికల్ గ్రౌండ్స్ కింద సెలవుల్లో వెళ్లడంపై డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్ పరిశీలిస్తున్నట్లు డీసీవో తెలిపారు.

తొలగించిన వైసీపీ స్టిక్కర్లు

గుడిపాల, ఏప్రిల్ 9: మాకో రూలు... వైసీపీవారికో రూలా... అనే వార్తకు మంగళవారం వసంతాపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ పురుషోత్తం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రెడ్డి, ఎన్నికల అధికారులు స్పందించారు. ప్రతిపక్ష పార్టీ అయిన టీడీపీ ప్రశ్నించడంతో వాటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు.

మృతిచెందిన శునకానికి దహనక్రియలు


మృతిచెందిన పప్పీ

పూతలపట్టు, ఏప్రిల్ 9: ఇంట్లో పెంచుకుంటున్న ఓ శునకం మృతిచెందడంతో మంగళవారం దహనక్రియలు నిర్వహించారు. మండలంలోని వీర్లగుడిపల్లె గ్రామానికి చెందిన హేమలత, సుబ్రహ్మణ్యం నాయుడు ఎనిమిదేళ్లుగా ఓ శునకాన్ని పెంచుకుంటూ, పప్పీ అని పేరుతో పిలుస్తుండేవారు. నాలుగురోజుల క్రితం అనారోగ్యం బారిన పడిన శునకం సోమవారం రాత్రి మృతిచెందింది. దీంతో కుటుంబ సభ్యులు మంగళవారం ఆ శునకానికి పాడెకట్టి దహన క్రియలు నిర్వహించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుబ్రహ్మణ్యం

బంగారుపాళ్యం, ఏప్రిల్ 9: ప్రజలకు మంచినీరు అందించేందుకు గాను మండలంలోని కూర్మాయిపల్లి పంచాయతీ తుమ్మరపల్లి గ్రామానికి చెందిన కరణం రుక్మణమ్మ కుటుంబ సభ్యులు చెంగల్రాయపిళ్ళై, గీతాంజలి జ్ఞాపకార్థం రూ.5 లక్షలు విలువ చేసే నీటి శుద్ధి ప్లాంట్‌ను గ్రామానికి వితరణ చేశారు. ఆమె దాతృత్వాన్ని గ్రామస్తులు కొనియాడారు. కరణం సుధాకరపిళ్ళై, దొరస్వామి రెడ్డి, కుమార్, రాజారెడ్డి, జగదీష్ రెడ్డి విశ్వనాథ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 9: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంతో పాటు ప్రజల్లో నమ్మకం కల్గించేందుకు మంగళవారం కేంద్ర బలగాలు బంగారుపాళ్యంలో కవాతు నిర్వహించాయి. ఎన్నికల ప్రక్రియలో అసాంఘిక శక్తులు చొరబడే ప్రమాదం ఉన్నందున వారికి ముందుగానే హెచ్చరికలు జారీ చేయడానికి ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున, కేంద్ర బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

బీఎస్పీ విస్తృత ఎన్నికల ప్రచారం

కార్వేటినగరం, ఏప్రిల్ 9: ఎన్నికల్లో బీఎస్పీ నేతలను గెలిపించాలంటూ కార్వేటినగరం పంచాయతీ విజయమాంబపురం, సుద్దగుంట, కోట చెరువు, దళితవాడ, టీకేఎం పేట దళితవాడ, రాజుల కండ్రిగ దళితవాడ, ఆర్‌కేవీబీ పేట, ఇందిరాకాలనీ గ్రామాల్లో మంగళవారం ఆ పార్టీ నేతలు ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ భానుచంద్ర, మండల అధ్యక్షులు గిరిబాబు, సత్యవేల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, ఏప్రిల్ 9: స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి పంటపల్లి గ్రామానికి చెందిన జయరామ్ నాయుడు, కుటుంబ సభ్యులు భోజనం వితరణ చేశారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, పంటపల్లి సర్పంచ్ సురేంద్ర నాయుడు, నాయకులు మోహన్‌బాబు, యశ్వంత్ చౌదరి, వాసుదేవ నాయుడు, పార్థసారథి నాయుడు, గురవప్ప, గుణశేఖర్, యోగి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 9: నగరంలోని అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రచురించిన క్రోధి నామ సంవత్సర ఉగాది క్యాలెండర్‌ను కోదండరామాలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చక ప్రతినిధులు శివాచార్యులు, సుధాకర్ గురుకుల్, నారాయణ చక్రత్తార్, వి. వేలు, మురళి, మల్లి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు


ఉగాది వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 9: జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం క్రోధి నామసంవత్సర ఉగాది వేడుకలు చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా సీఆర్ రాజన్ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య బ్రాహ్మణోత్తములు పంచాంగ శ్రవణం చేశారు. 2024వ సంవత్సర కాలంలో వర్షంతో పాటు సంభవించే పరిస్థితులను టీడీపీ నాయకులు, కార్యకర్తలకు వివరించారు. జరగబోయే ఎన్నికల్లో చంద్రబాబు తప్పక విజయం సాధించి ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. అనంతరం ఉగాది పచ్చడి, పంచామృతం, కాణిపాక వినాయకస్వామి ప్రసాదాలను నాయకులకు, కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు కోదండయాదవ్, కార్జాల అరుణ, సీఎంటీ త్యాగరాజన్, వెంకటేష్, రాజశేఖర్, ఆనంద్, శేషాద్రి, శంకర్, శివ, మూర్తి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అదుపులో మంటలు

- పొగతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు

చిత్తూరు, ఏప్రిల్ 9: నగరపాలక సంస్థ డంపింగ్‌యార్డులో మంటలు మంగళవారం ఉదయం అదుపులోకి వచ్చాయి. పొగ మాత్రం కమ్ముకోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు డంపింగ్‌యార్డులో మంటలు అంటుకున్నాయి. దాంతో పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో మంటలు అంతకంతకు పెరిగిపోవడంతో అగ్నిమాపక సిబ్బంది చిత్తూరుతో పాటు బంగారుపాళ్యంలో ఉన్న అగ్నిమాపక వాహనాలను డంపింగ్‌యార్డుకు తీసుకొచ్చి ఆర్పే ప్రయత్నం చేశారు. మగళవారం ఉదయం మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు మరోసారి రాకుండా మిగిలిన చెత్తను పోర్టబుల్ పంప్‌యంత్రాలతో నీటితో తడుపుతున్నారు. పొగలు మాత్రం అదుపులోకి రాకపోవడంతో స్థానికులు ఊపిరాడక ఇబ్బందులు పడ్డారు. కమిషనర్ అరుణ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. డీఈ రమణ, ఇన్‌ఛార్జీ ఎంహెచ్‌వో చిన్నయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యం: గురజాల


ఇఫ్తార్ విందులో పాల్గొన్న గురజాల జగన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 9: ముస్లింల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నగరంలోని 30వ డివిజన్ పరిధిలోని లాలూగార్డన్, టాప్‌లైన్, అశోక్‌పురం, గూలింగ్స్‌పేట్ తదితర ప్రాంతాల్లో ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. గురజాల మాట్లాడుతూ అనంతపురం నుంచి అనకాపల్లి వరకు ముస్లింల అభివృద్ధి టీడీపీతో సాధ్యమైన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం ఉపవాస దీక్ష ముగించిన ముస్లిం సోదరీమణులకు హలీంను అందజేశారు. కార్యక్రమంలో గురజాల ప్రతిమ, మాజీ ఎమ్మెల్యే మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నగర మాజీ మేయర్ కఠారి హేమలత, మనోహర్ నాయుడు, పందీఫ్, శేషాద్రి, అత్తాబాయ్, ఆరిఫ్, షరీఫ్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ మంగళవారం నగరంలోని 36, 37 డివిజన్లలో మాజీ మేయర్ కఠారి హేమలతతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా జగన్మోహన్‌ను గెలిపించాలని కోరారు. డిప్యూటీ మేయర్ సుబ్రమణ్యం బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగాది వేడుకల్లో టీడీపీ నేతలు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 9: చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మింద, తొపాతిపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు ఆయన్ను ఘనంగా ఆహ్వానించారు. క్రోధి నామ సంవత్సరం ప్రజలందరికీ శుభం జరగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, నాయకులు కోదండ యాదవ్, మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, కాశీ, రాజా, సురేష్, రాజేంద్రన్ పాల్గొన్నారు.


ఉగాది వేడుకల్లో పాల్గొన్న గురజాల, సీఆర్ రాజన్ తదితరులు

కొమ్మేపెళ్లమ్మను దర్శించుకున్న గురజాల

యాదమరి, ఏప్రిల్ 9: మండలంలోని ఎర్రజేను గ్రామ సమీపంలో వెలసిన కొమ్మేపెళ్లమ్మ దేవతను చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్, నేతలు మంగళవారం దర్శించుకున్నారు. గురజాలను ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి, గ్రామ పెద్ద జగన్నాధరెడ్డిలు శాలువతో సత్కరించారు. సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు పాల్గొన్నారు.

ప్రాజెక్టు కాలువ భూమి పూడ్చివేతకు యత్నం


ప్రాజెక్టు నీటి కాలువ పూడ్చివేతకు తోలినమట్టి


కార్వేటినగరం, ఏప్రిల్ 9: కృష్ణాపురం ప్రాజెక్టు నుంచి నీరందించే కాలువను పూడ్చి వేయడానికి కొందరు ప్రయత్నం చేశారు. కృష్ణాపురం క్రాస్ రోడ్డు వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిని అనుకొని ఉన్న నీటి కాల్వను ట్రాక్టర్ల ద్వారా మట్టి తోలి పూడ్చి వేయడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అధికారులు సోమవారం అడ్డుకున్నారు. మండలంలో కృష్ణాపురం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినప్పుడు నీటి కాల్వల భూసేకరణ కోసం రైతులకు భూనష్టపరిహారం కూడా గతంలో చెల్లించారు. ప్రస్తుతం ప్రాజెక్టు కాలువల మనుగడ ప్రశ్నార్థకంగా తయారైంది. కృష్ణాపురం క్రాస్ రోడ్డు వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూమి కొనుగోలు చేసి వాణిజ్య అవసరాల కోసం ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల ప్రాజెక్టు నీటి కాలువలకు ముప్పు ఏర్పడింది. ప్రాజెక్టు నీటి కాలవలు అదృశ్యమవుతున్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. కృష్ణాపురం ప్రాజెక్ట్ నీటి కాలువల పరిరక్షణ కోసం జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పేటపల్లిలో ఇంటింటి ప్రచారం

పూతలపట్టు, ఏప్రిల్ 9: మండలంలోని కమ్మగుట్టపల్లి పంచాయతీ పరిధిలోని పేటపల్లి గ్రామంలో మంగళవారం టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ గెలుపు కోసం స్థానిక ఎంపీటీసీ విజయలక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ చౌదరి, నేతాజి, వాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో ఉగాది పండుగ




చిత్తూరులో వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి, నగరిలో పంచాంగ శ్రవణం పఠిస్తున్న వేదపండితులు ప్రసాద్‌శర్మ, కార్వేటినగరం పురవీధుల్లో ఊరేగుతున్న వేణుగోపాలస్వామి

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 9: క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను మంగళవారం నగరవాసులు భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. ఇళ్ళ ముందు మామిడి తోరణాలు కట్టి పూలతో అలంకరించారు. నగరంలోని పలు ఆలయాలను నిర్వాహకులు సర్వాంగసుందరంగా అలంకరించి మూలవర్లకు విశేష పూజలు చేసి, ప్రత్యేక అలంకారాలతో భక్తులకు దర్శనం కల్పించారు. కోదండ రామాలయంలో ఈవో సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో అర్చకులు వేణుగోపాల్ పంచాంగ పఠనం గావించారు. భక్తులకు ఉగాది పచ్చడితో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నగరి: నగరి పట్టణంలోని టీటీడీ ఆధ్వర్యంలో వున్న కరియమాణిక్య స్వామి ఆలయంలో వేదపండితులు ప్రసాద్‌శర్మ పంచాగ శ్రవణం చేశారు. ఆలయ అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో ఉగాది ఆస్థానం నిర్వహించారు. అనంతరం రుక్మిణి సమేత సత్యభామ వేణుగోపాల స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విజయపురం: పొన్నమ్మ ఆలయంలో వేద పండితులు వందవాసి మహేష్‌శర్మ పంచాగాన్ని పఠించారు.

పాలసముద్రం: మండలంలోని శ్రీబొమ్మరాజుపురం, మఠవళం, బలిజకండ్రిగ, ఆముదాల, తిరుమలరాజుపురం, నరసింహాపురం గ్రామాల్లో వున్న ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు అభిషేకాలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. పంచాంగ శ్రవణం నిర్వహించారు.

నిండ్ర: నిండ్ర ఓంశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానంచేశారు.

చిత్తూరు: చిత్తూరులో ప్రభుత్వ వాహనడ్రైవర్ల సంఘ కార్యాలయంలో వేదపండితులు పంచాంగాన్ని పఠించి, ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు పన్నీర్‌శెల్వం డ్రైవర్లకు స్వీటు బాక్సులను పంచిపెట్టారు. జనరల్‌సెక్రటరి రోషన్ బాషా, ఉపాధ్యక్షులు హరి, ఆర్గనైజింగ్ సెక్రటరి సురేష్‌బాబు, కోశాధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో జ్ఞానప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సాక్షి గణపతి, బాలసుబ్రహ్మణ్యం, రాజరాజేశ్వరిదేవి, జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి, కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజాలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థప్రసాదాలను అందజేశారు. చవటగుంటలోని వినాయక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త మిట్టపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి పర్యవేక్షించారు.

గుడిపాల: మండలంలోని కోలావూరు, చెరువుముందరవూరులో వెలసివున్న వేణుగోపాలస్వామి ఆలయం, 197 రామాపురంలో వెలసివున్న జ్ఞానప్రసూనాంబ సమేత యజ్ఞేశ్వరాలయం, వీరబ్రహ్మం గారి గుడి, అత్తిగారి గుట్టలో వెలసివున్న శివాలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఆనంద్, బ్రహ్మయ్య, కిరణ్‌కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తవణంపల్లె: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అర్థగిరి వీరాంజనేయస్వామి ఆలయం, టి.పుత్తూరు కోదండ రామాలయం, అరగొండ రామాలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు.




డీఆర్‌ఎన్‌కండ్రిగలో ప్రత్యేక అలంకరణలో పంచముఖ ఆంజనేయస్వామి, డ్రైవర్లకు స్వీట్లను పంచిపెడుతున్న ఆ సంఘ జిల్లా అధ్యక్షులు పన్నీర్ శెల్వం, అర్ధగిరిలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

వైసీపీ ప్రభుత్వం పట్ల అందరికీ విముఖతే

-గాలి భానుప్రకాష్


టీడీపీలో చేరిన వారితో భానుప్రకాష్

వడమాలపేట, ఏప్రిల్ 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న సామాన్య ప్రజలతో పాటు వైసీపీ నాయకులు సైతం విముఖతతో టీడీపీకి మద్దతు పలుకుతున్నారని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం తిరుపతిలోని ఆయన స్వగృహం వద్ద వడమాలపేట మండలానికి చెందని పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి భానుప్రకాష్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రిగా రోజా అరాచకాలు, దౌర్జన్యాలతో ఇబ్బందులు పడ్డ వైసీపీ నాయకులు స్వచ్ఛందంగా టీడీపీలో వస్తున్నారన్నారు. వడమాలపేట మాజీ వైఎస్‌ఎంపీపీ నాగరాజు, ఎస్‌వీ పురానికి చెందిన వెంకటసుబ్బయ్య, తులసీరామ్, మునికృష్ణ, చెంగయ్య,దాము, సుబ్రహ్మణ్యం, కల్లూరుకు చెందిన వేణుగోపాలరెడ్డి, దాము, మహేష్, సుబ్బయ్య టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, దాముయాదవ్, అంజయ్య, రఘురామయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



కాణిపాకంలో మంగళవారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో వెంకటేశు తదితరులు, స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న దివంగత నాయకుడు మహదేవ నాయుడు కుటుంబ సభ్యులు

సారా విక్రేత అరెస్టు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 9: అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ హరికృష్ణ తెలిపారు. మండలంలోని రామాంజుపురం గ్రామానికి చెందిన మునస్వామి రాజు ఐదు లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అక్రమంగా నాటుసారా, మద్యం బెల్టుషాపుల్లో అమ్ముతున్నట్లు తెలిస్తే తమకు 9492814414 నెంబరుకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

ఘనంగా ఉగాది సత్కారాలు


అర్చక, పురోహితులను సత్కరిస్తున్న దేవదాయశాఖ ఏసీ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 9: నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం జిల్లా దేవదాయశాఖ ఆధ్వర్యంలో అర్చక పురోహిత ప్రతినిధులకు ఉగాది సత్కారాలు అందచేశారు. కార్యక్రమానికి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనరు ప్రసన్నలక్ష్మి అధ్యక్షత వహించారు. చిత్తూరు కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరాలయ అర్చకులు ఆర్. మోహన్‌రంగన్, కట్టమంచి వరదరాజస్వామి ఆలయ అర్చకులు నారాయణ చక్రత్తార్, అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులను ఏసీ సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవోలు సుబ్రమణ్యం నాయుడు, తిమ్మారెడ్డి, అర్చక సంఘం ప్రతినిధులు సుధాకర్ గురుకుల్, శివాచార్యులు, మల్లి ఆచారి, మురళీ, వి. వేలు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- నగరి ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి

నగరి ఏప్రిల్ 9: కాంగ్రెస్‌పార్టీతోనే దేశం, రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని నగరి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. నగరి పట్టణ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా దేశం, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్‌పార్టీ విజయానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి బాబు, పీసీసీ సభ్యులు నటరాజమొదలియార్, డీసీసీ ఉపాధ్యక్షుడు డిల్లీ, నాయకులు దేశయ్య, చిరంజీవులురెడ్డి, కుమార్, నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న రాకేష్‌రెడ్డి

వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ


చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ

పూతలపట్టు, ఏప్రిల్ 9: మండలంలోని పి. కొత్తకోట సమీపాన గల వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆలయంలో మూడునెలలకోసారి హుండీ లెక్కింపు జరుగుతుంది. కొన్ని రోజుల్లో హుండీ లెక్కింపు జరుగనుండగా, సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగులగొట్టి అందులో వున్న రూ.40 వేలు నగదును చోరీచేశారు. గర్భగుడి తాళాలను పగులగొట్టేందుకు ప్రయత్నించి విఫలం చెందారు. సమాచారం అందుకున్న పూతలపట్టు సీఐ సుదర్శనప్రసాద్ తమ సిబ్బందితో పాటు క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను తీసుకెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడి, చికిత్స పొందుతూ మృతి


రవి (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, ఏప్రిల్ 9: చంద్రగిరి జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయడిపన రవి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు కార్వేటినగరానికి చెందిన రవి(40) టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సొంత పనుల నిమిత్తం ఈనెల 5న బైక్‌పై చిత్తూరు వెళ్లాడు. తిరిగి తిరుపతికి వస్తుండగా చంద్రగిరి జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ సమీపంలో బైక్ అదుపు తప్పి ప్రహరీ గోడను ఢీ కొన్నాడు. రవికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. తర్వాత చెన్నైలోని రాజీవ్‌గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.